ప్రజాశక్తి
మంగళవారం 18 ఫిబ్రవరి, 2025
5
శ్రీకాకుళం



20న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాపరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 20వ తేదీన జెడ్‌పి సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎల్.ఎన్.వి శ్రీధర్‌రాజా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు సమావేశాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 10.30 గంటలకు 6వ స్థాయి, 11.30 గంటకు 3వ స్థాయి, మధ్యాహ్నం 12.30 గంటలకు 5వ స్థాయి సంఘం సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 2, 4, 1, 7 స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహిస్తామని వివరించారు.

అంగన్వాడీల నిరసనాగ్రహం

- ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ధర్నా
- సమస్యలను పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం
- అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ హెచ్చరిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లను మార్చాలని, సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలని తదితర డిమాండ్లతో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు ఆందోళన చేపట్టారు. జిల్లావ్యాప్తంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద సోమవారం ధర్నాలు చేశారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం నగరంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేకపోతే పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీలకు ఐదేళ్లుగా వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిఎ కూడా అమలు చేయడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీలు చేసిన సుదీర్ఘ పోరాట సందర్భంలో జూలైలో వేతనాలు పెంచుతామని, మరో 11 రకాల డిమాండ్లను నెరవేరుస్తామని మినిట్స్ కాపీ ఆధారంగా హామీ ఇచ్చారని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మినిట్స్ కాపీ హామీలు అమలు చేయాలని కోరుతూ అనేక దఫాలుగా మంత్రుల నుంచి ముఖ్యమంత్రి వరకు విన్నవించుకున్నామన్నారు. నేటికీ ఏ ఒక్క సమస్యను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. ధరలు విపరీతంగా పెరుగుతున్నా, ఐదేళ్లుగా జీతాలు పెంచలేదని విమర్శించారు. అనేక రకాల యాప్‌ల పేరుతో, నూతన విధానాలతో ప్రభుత్వం పనిభారాన్ని పెంచుతుందే తప్ప వారి ఆర్థిక కష్టాలు మాత్రం గుర్తించడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా గ్రాట్యుటీ ఇస్తామని టిడిపి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని విస్మరించిందని విమర్శించారు. మినీ సెంటర్లలో వర్కర్లకు తక్కువ వేతనంతో ఎక్కువ పనిభారాలు మోపుతున్నారని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలన్నారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కార ఖర్చులకు రూ.20 వేలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సెంటర్ అద్దెలు, టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు. అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్ మార్పు చేయాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ కనీసం మూడు నెలలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాష్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కె.జ్యోతి, జి.రాజేశ్వరి, కె.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నా అనంతరం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీబాయికి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి పంచాది లతాదేవి, నాయకులు పొన్నాడ భూలక్ష్మి, బి.జ్యోతి, నాగరత్నం, శైలజ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం : ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కె.సుజాత, రణస్థలం ప్రాజెక్టు అధ్యక్షులు బి.అప్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

బూర్జ : అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ధర్నాలో యూనియన్ నాయకులు కె.రాధిక, సిహెచ్.అన్నపూర్ణ, డి.సుజాత, డి.సంతోషిరూప, పి.గజలక్ష్మి పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అనురాధ, కె.వి.హేమలత, ఎస్.ధనలక్ష్మి, జలజాక్షి, రజని, విజయ, మధురవేణి, లక్ష్మి, ప్రజాసంఘాల నాయకులు సిర్ల ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం ఐసిడిఎస్ పిఒ విమలకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

సోంపేట : దీర్ఘకాలికంగా, అపరిష్కృతంగా ఉన్న అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకుడు ఎస్.లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం కోరుతూ ఐసిడిఎస్ కార్యాలయ సిబ్బందిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డి.మోహిని, తేజవతి, పి.సుజాత, వి.హారతి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అంగన్వాడీ వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధ డిమాండ్ చేశారు. స్థానిక ఐటిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్‌తో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రాజెక్టు సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

టెక్కలి : అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు ఉద్యోగన్నత, భద్రత కల్పించాలని డిమాండ్లతో కూడినపత్రాన్ని పిఒ శోభారాణికి అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి బి.ఆదిలక్ష్మి, పద్మావతి, రమాదేవి, శ్రీదేవి, అరుణ పాల్గొన్నారు.

పాతపట్నం : రూ.26 వేలు వేతనాలు చెల్లించాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ... ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పిఒ విమలరాణిని కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యు.ఉషారాణి, డి.లలిత, యు.లీలారాణి, జి.రాణి, హెల్పర్లు పాల్గొన్నారు.

పలాస : ఆందోళన, సమ్మె సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా చేపట్టారు. ఇందులో భాగంగా ఐసిడిఎస్ పిఒ కె.పార్వతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆర్.భవాని, బి.చామంతి, బి.సునీత, పద్మ, నిర్మల పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : అంగన్వాడీ కార్యకర్తలకు గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. ఎచ్చెర్ల ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. సిపిఒ డోల పాపినాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పి.విజయలక్ష్మి, బి.శారదాకుమారి, కె.ధనలక్ష్మి, ఎం.రాధిక, ఎం.రాములమ్మ, సరస్వతి, కె.లలితాకుమారి పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్ : ధర్నా చేస్తున్న అంగన్వాడీలు


పాతపట్నం : వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు


పలాస : వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు


ఆమదాలవలస : ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు


కోటబొమ్మాళి : వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు


బూర్జ : ధర్నా చేస్తున్న అంగన్వాడీలు


రణస్థలం : ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు


సోంపేట : వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు


కొత్తూరు : నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు


మందస : మాట్లాడుతున్న విజయగౌరి

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి - కంచిలి, మందస, టెక్కలి

విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో పోరాడతానని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. కంచిలి, మందస, టెక్కలి మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలు, కెజిబివిలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈనెల 27న నిర్వహించనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులు, అధ్యాపకులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం 117 జిఒను రద్దు చేస్తామని చెప్తూనే, దాని స్థానంలో అలాంటి విధానాలతో మరో జిఒను తీసుకొస్తోందని తెలిపారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలను ప్రతిఘటించేందుకు, ఉపాధ్యాయుల గొంతుకగా నిలిచేందుకు తనను గెలిపించాలని కోరారు. సిపిఎస్ రద్దు కోసం పోరాటం చేస్తానని, కెజిబివిలో సిఆర్‌టిలకు ఎంపిఎస్ విధానం అమలయ్యేలా కృషి చేస్తానని చెప్పారు. కాంట్రాక్టు అధ్యాపకులకు 114 జిఒ అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానన్నారు. మోడల్ స్కూల్‌లోని ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉపాధ్యాయుల మాదిరిగానే సర్వీస్ రూల్స్ వర్తించేలా చూస్తానని హామీనిచ్చారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ప్రభుత్వమే సంక్షేమ నిధిని, బీమాను ఏర్పాటు చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల వ్యవస్థను యథాతథంగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైస్కూల్ ప్లస్ టు విధానాన్ని కొనసాగించాలన్నారు. యూనివర్సిటీ, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు, నాయకులు జి.రమేష్, ఎన్.రవి, త్రినాథ్, దాసరి ఈశ్వరరావు, సనపల స్వప్న, కె.దాలయ్య, పాలవలస ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి రామారావుపై దాడి చేసిన టిడిపి మండల అధ్యక్షులు వేణుగోపాల్ నాయుడును అరెస్టు చేయాలని జర్నలిస్టు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యాన జర్నలిస్టులు సోమవారం మానవహారం నిర్వహించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్.జోగినాయుడు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలనకు వెళ్లిన విలేకరిపై భౌతిక దాడికి పాల్పడడంతో పాటు చంపుతామని బెదిరించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు.

సమాజ శ్రేయస్సు కోసం వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై దాడులు సరికాదన్నారు. జర్నలిస్టుల రక్షణకు ప్రభుత్వం చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వేణుగోపాల్ నాయుడుపై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలన్నారు. ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ మేనేజర్ పి.కామినాయుడు మాట్లాడుతూ బెదిరింపులతో విలేకరుల స్వతంత్రతను, పత్రికా స్వేచ్ఛను దెబ్బతీయడం సాధ్యం కాదన్నారు. ధర్నాకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వపు గవర్నర్ గేదెల ఇందిరాప్రసాద్ సంఘీభావం తెలిపి, జర్నలిస్టుపై దాడిని తీవ్రంగా ఖండించారు. ధర్నా అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో డిఎస్‌పి సిహెచ్.వివేకానందను కలిసి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు టి.భీమారావు, ఎస్.వెంకటరమణ, ఎపియుడబ్ల్యుజె నాయకులు ఎం.మల్లేశ్వరరావు, జర్నలిస్టు సంఘాల నాయకులు సిహెచ్.నాగభూషణం, టెంక శ్రీను, బుజ్జిబాబు, కిరణ్, సాయి, గంజి ఎజ్రా, రౌతు సూర్యనారాయణ, ఆకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

పరిశ్రమల్లో భద్రతపై నిశిత పరిశీలన

- ప్రమాదాల నివారణకు ఆకస్మిక తనిఖీలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలుపై నిశిత పరిశీలన చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. పారిశ్రామిక యూనిట్లలో ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లా పారిశ్రామిక ప్రమాదాల నివారణ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మోనియా, క్లోరిన్, ఎల్‌పిజి, బ్యుటెన్ వంటి మండే స్వభావం ఉన్న వాయువులను పెద్ద పరిమాణంలో వినియోగించే పరిశ్రమల్లో కట్టుదిట్టమైన భద్రతా ప్రమాణాలు ఉండాలన్నారు. తరచూ మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రమాదాలు సంభవించే క్రమంలో నష్టాలను నివారించుకోవాలన్నారు. విష వాయువులు వెలువడే పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు భద్రతా ప్రమాణాలపై తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తనిఖీల నివేదిక ఆధారంగా అన్ని పరిశ్రమల్లో మార్గదర్శకాలు తప్పక పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాస్థాయిలో సమర్థవంతమైన విపత్తు నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రణాళికా విభాగం, సెర్చ్, రెస్క్యూ యూనిట్, ఉపశమనం, పునరావాసం, కమ్యూనికేషన్, రవాణా, లాజిస్టిక్, అత్యవసర సమయంలో వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు ఆస్పత్రిలో మందులు, సిబ్బంది, అంబులెన్స్ తదితర అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలన్నారు. ప్రమాదాల కట్టడికి అవసరమైన అన్ని జాగ్రత్తలను పరిశ్రమల యాజమాన్యాలు పాటించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రాంబాబు, జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి మోహనరావు, సివిల్ డిఫెన్స్ ఆఫీసర్ కె.పద్మలత, డిప్యూటీ చీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఎక్స్‌ప్లోజివ్స్ జె.సర్కార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.త్రినాథస్వామి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ కరుణశ్రీ, విపత్తుల నిర్వహణ డిపిఎం పి.రాము, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, పలు పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

శాసనమండలిలో ప్రశ్నించే గొంతుక పిడిఎఫ్

మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శాసనమండలిలో ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలపై ప్రశ్నించేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల అధ్యాపకులు, కాంట్రాక్టు అధ్యాపకులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యా విధానంపై తీవ్ర దాడి జరుగుతోందన్నారు. ప్రభుత్వ విధానాలు ప్రయివేట్‌ను ప్రోత్సహించేలా ఉన్నాయని విమర్శించారు. ప్రభుత్వం కళాశాలలో కొత్త కోర్సులు, సిబ్బంది నియమాకం, మౌలిక వసతులు కల్పించకపోవడంతో విద్యార్థుల డ్రాపౌట్స్ పెరుగుతున్నాయని చెప్పారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల పోరాటం ఫలితంగానే కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలు పెరిగాయని గుర్తు చేశారు. రాజకీయ పార్టీల తరుపున గెలిచే వ్యక్తులను శాసనమండలికి పంపితే వారిపై ఆయా పార్టీల పెత్తనం ఉండడంతో, వారు సమస్యలపై మాట్లాడే అవకాశం ఉండదన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయగౌరిని గెలిపిస్తే ఆమె స్వతంత్రంగా వ్యవహరించి సమస్యలపై పోరాడతారని చెప్పారు. ఆయన వెంట జెవివి నాయకులు మురళీధర్, ఉద్యోగ సంఘాల నాయకులు కె.శ్రీనివాసు, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - జలుమూరు

శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. ఈనెల 26, 27, 28 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న మహా శివరాత్రి మహోత్సవాల బందోబస్తు ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. చక్రతీర్థ స్నానాల సందర్భంగా ఆలయ పరిసరాలు, నదీ పరివాహక ప్రాంతాలను సందర్శించి పలు సూచనలు చేశారు. దర్శనానికి వచ్చే సందర్శకులకు క్యూ లైన్లు పక్కగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఉత్సవాల కోసం ఎక్కడెక్కడ పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించాలన్న దానిపై పూర్తిస్థాయిలో నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. చక్రతీర్థ స్నానాల రోజున నదిలో స్నాన ఏర్పాట్లు, బారికేడ్లు, రూట్ మ్యాప్, వాహనాల పార్కింగ్‌కు అనుకూలంగా ఉండే ప్రదేశాలను పరిశీలించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టెక్కలి డిఎస్‌పి డి.ఎస్.ఆర్.వి. ఎస్.ఎన్ మూర్తి, ఎస్‌బి సిఐ ఇమ్మాన్యుల్ రాజు, సిఐలు జె.శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఎస్ఐ అశోక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర్ రెడ్డి

అప్పులపాలై.. దొంగగా మారి

బంగారం చోరీ కేసులో వ్యక్తి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి వివేకానంద్

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

గార మండలం శాలిహుండంలో గత నెల 22న జరిగిన బంగారం చోరీ కేసును పోలీసులు ఛేదించారు. దొంతతనానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక ఎస్‌పి కార్యాయం సమావేశ మందిరంలో సోమవారం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద్ విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గార మండలం శాలిహుండానికి చెందిన జోగి రాజు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆటో కొనేందుకు కొంత మంది దగ్గర అప్పులు చేయడంతో పాటు డైలీ ఫైనాన్స్ తీసుకున్నాడు. దీంతో అతని కొడుకు పుట్టిన సందర్భంలో చేసిన అప్పులూ ఉండటంతో తీర్చేమార్గం లేక దొంతనం చేయాలని నిర్ణయించాడు. తన ఇంటి పక్కనే ఉంటున్న ఉరజాన రమణమ్మ ఇంట్లో బంగారం ఉన్నట్లు తెలుసుకున్నాడు. వ్యాపార నిమిత్తం భార్యాభర్తలు ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాత్రికి వస్తారని తెలుసుకున్నాడు. ఆ ఇంట్లో దొంగతనం చేస్తే ఎవరికీ అనుమానం రాదని అనుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గత నెల 22న ఇంటికి వెనుక వైపు నుంచి తాళాలు వేయకపోవడాన్ని గమనించి ఇంట్లోకి ప్రవేశించాడు. బీరువా తాళాల సహాయంతో బీరువా తెరిచి బాక్స్‌లో ఆరు రకాల బంగారు ఆభరణాల తీసుకుని వెళ్లిపోయాడు. దొంగతనం జరిగిందన్న విషయం తెలుసుకున్న వీధిలోని వారు చేరుకోగా ఏమీ ఎరనట్టు నిందితుడూ వారితోనే ఉన్నాడు. గార పోలీస్‌స్టేషన్‌కి ఫిర్యాదు చేశారు. పోలీసులకు దొరికిపోతాననే ఆందోళనతో నిందితుడి ఇంట్లో మేడపైన హోమ్ థియేటర్‌లో బంగారాన్ని దాచిపెట్టాడు. అప్పులు ఇచ్చిన వాళ్లకు బాకీ తీర్చడానికి ఆరు తులాల బంగారంతో బయలుదేరుతున్న జోగి రాజును పోలీసులు ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు పట్టుకున్నారు. నిందితుడు నుంచి మొత్తం 17 1/2 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు

పోలీసులు చాలా చాకచక్యంగా వ్యవహరించడంతో ఎటువంటి సాంకేతిక ఆధారాలు లేకపోయినా బంగారం చోరీ కేసును ఛేధించారు. నిందితుడిని పట్టుకుని, బంగారం స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిన సిఐ పైడిపునాయుడు, గార ఎస్.లక్ష్మీజనార్ధన్, ఒన్ టౌన్ ఎస్ఐ ఎం.హరికృష్ణ, సిబ్బంది ఎఎస్ఐ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్ల సూరిబాబు, జగదీష్, రమణమూర్తి, బాలకృష్ణలను ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డి, డిఎస్‌పి వివేకానంద అభినందించారు.

గ్రూప్-2 పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈనెల 23న నిర్వహించనున్న గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి కోఆర్డినేటింగ్, లైజనింగ్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 23న ఉదయం పది నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం మూడు నుంచి 5.30 గంటల వరకు గ్రూప్-2 పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష నిర్వహణకు శ్రీకాకుళం, ఎచ్చెర్లలో 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 5,535 మంది అభ్యర్థులు ఈ పరీక్షలు రాసేందుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి కేంద్రం వద్ద తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో ఉండాలన్నారు. పరీక్షా సమయంలో విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని ఇపిడిసిఎల్ అధికారులను ఆదేశించారు. ముందుజాగ్రత్తగా జనరేటర్లను అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఒ బాలమురళీకృష్ణను ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ సాయిప్రత్యూష, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, జిల్లా ఉద్యాన అధికారి వరప్రసాద్, ఎన్‌వైకె కోఆర్డినేటర్ ఉజ్వల్, కలెక్టరేట్ హెచ్-సెక్షన్ సూపరింటెండెంట్ చక్రవర్తి, లైజనింగ్ అధికారులు, సిబ్బంది, ఆయా కళాశాలల ప్రతినిధులు, సెక్షన్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.



జి.సిగడాం మోడల్ స్కూల్‌లో మాట్లాడుతున్న బాలాజీ

విజయగౌరికి మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరికి ప్రాధాన్యత ఓటు వేసి విజయాన్ని అందించాలని ఎపి మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎస్. బాలాజీ కోరారు. సోమవారం జిల్లాలోని జి.సిగడాం, తామాడ, కొండ ములగాం, కుప్పిలి, పొందూరు మోడల్‌స్కూల్స్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మోడల్ స్కూల్ అధ్యాపకుల సమస్యలపై యుటిఎఫ్ నాయకత్వాన నిరంతరాయంగా పోరాడుతున్నామన్నారు. అనేక సమస్యల పరిష్కారం వెనుక యుటిఎఫ్‌తో పాటు పిడిఎఫ్ ఎమ్మెల్సీల సహకారం ఉందని గుర్తు చేశారు. మరిన్ని పెండింగ్ సమస్యలు పరిష్కరించుకునేందుకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయగౌరిని గెలిపించుకోవాల్సిన అవసరముందని ఆయన సూచించారు.



ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎంసి సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు

పాఠశాలను విలీనం చేయొద్దు

ప్రజాశక్తి- లావేరు

పెదరావుపల్లి పంచాయతీ నక్కపేటలో ఉన్న ఎంపియుపి పాఠశాలను ఉన్నత పాఠశాలలో విలీనం చేయవద్దని గ్రామనికి చెందిన ఎస్ఎంసి చైర్మన్ రమణమ్మ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రుల కమిటీసభ్యులు, గ్రామస్తులు సోమవారం ఎంపిడిఒ పి. వెంకటరాజు, ఎంఇఒ వాగ్దేవిలకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో 52 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఈ పాఠశాలలో నక్కపేటకాలనీ, కూనపువానిపేట, పండిపేట తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారని, ఈ పాఠశాలను జెడ్‌పి పాఠశాలలో విలీనం చేస్తే ఈ గ్రామాల విద్యార్థులు ఇబ్బందులకు గురవ్వడంతో పాటు చాలా మంది విద్యకు దూరమయ్యే పరిస్థితి వస్తుందని వారంతా ఆందోళన వ్యక్తం చేశారు. రవాణా ఇబ్బందులు ఉంటాయని, అధికారులు స్పందించి తమ గ్రామంలోనే ఎంపియుపి పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంసి సభ్యులు ఎం.గౌరీశంకర్, రమణ, ప్రియ, మోహిని, లక్ష్మి, శంకర్, మాధవి, భారతి, రామకృష్ణ, శ్రీనువాసరావు, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

'పది'లమైన విజయం కోసం...

- సి,డి గ్రేడ్‌లపై ప్రత్యేక శ్రద్ధ
- ప్రతిరోజూ ఆన్‌లైన్ టెస్టులు
- రాత్రివేళల్లో తనిఖీలు
- శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న స్టడీ అవర్స్

ప్రజాశక్తి- కవిటి

పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు అహర్నిశలు శ్రమిస్తున్నారు. విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి మండలంలోని 21 ప్రభుత్వ ఉన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి 970 మంది విద్యార్థులు, రెండు ప్రయివేట్ పాఠశాలల నుంచి 46 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే పూర్తిస్థాయి శిక్షణ అందించిన ఉపాధ్యాయులు ఈ నెల రోజులూ విద్యార్థులకు పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. శిలగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న 55 మంది ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్నారు. వీరికి ఎస్‌సిఇ, ఇఆర్‌టి సూచనల మేరకు ప్రభుత్వం రూపొందించిన డాట్ (డైలీ ఆన్‌లైన్ టెస్టు) పరీక్షలు రోజూ నిర్వహిస్తూ విద్యార్థులకు ఎప్పటికప్పుడు మెరుగులు దిద్దుతున్నారు. రోజూ ఉదయం 8 నుంచి 9.15 నిమిషాల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. వీటిద్వారా విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ, దిగువ శ్రేణి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. పాఠశాలలోని 16 మంది ఉపాధ్యాయులు కూడా పాఠశాలలో ఉన్న 55 మంది విద్యార్థుల బాధ్యతను తీసుకుని రోజూ వారి విద్యా విషయాలను పర్యవేక్షిస్తూ, వారి సందేహాలను నివృత్తి చేస్తూ, ఎప్పటికప్పుడు వారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ పిల్లల సమాచారం చేరవేస్తున్నారు. రాత్రి వేళల్లో కూడా ఈ 16 మంది ఉపాధ్యాయులు కూడా తమకు సంబంధించిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారు చదువుతున్నది లేనిది తెలుసుకొని వారి తల్లి దండ్రులకు తగు సూచనలు ఇస్తున్నారు. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు కూడా తమ పిల్లల చదువులపై ప్రత్యేక దృష్టి సారించి ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారు.

స్టడీ మెటీరియల్ అందించిన యుటిఎఫ్

మరోవైపు యుటిఎఫ్ అందించిన స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగ పడుతున్నట్టు ఉపాధ్యాయులు తెలిపారు. ముఖ్యంగా ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే కాకుండా విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ కూడా అందించి యుటిఎఫ్ తన ప్రత్యేకత చాటుకుందని ఉపాధ్యాయులు తెలిపారు.

గణితంపై ప్రత్యేక శ్రద్ధ

చాలామంది విద్యార్థుల్లో గణితం అంటేనే ఒక విధమైన అభద్రతాభావం ఉంటుంది. దాన్ని గుర్తించి ఎప్పటికప్పుడు విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని పెంపొందిస్తూ పాఠాలు బోధించారు. దిగువ శ్రేణి విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పదో తరగతి విద్యార్థులను రెండు గ్రూపులుగా విభజించి ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తూ పాఠాలు బోధించారు. 55 మంది విద్యార్థుల్లో 5 నుంచి 10 మంది విద్యార్థులు గణితంలో వందకు వంద మార్కులు సాధిస్తారు. అలాగే పాఠశాలలో గణితంలో శతశాతం ఉత్తీర్ణత వస్తుందని కచ్చితంగా చెప్పగలను.

- జి.ఢిల్లేశ్వరరావు
గణిత ఉపాధ్యాయులు
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శిలగాం

ప్రత్యేక మెటీరియల్ అందించాను

పదో తరగతి విద్యార్థుల కోసం ఎస్‌సిఇఆర్‌టి సూచనల మేరకు ప్రత్యేక మెటీరియల్ తయారు చేసి వారికి అందించాం. మొదటి నుంచి రెండు గ్రూపులుగా విభజించి విద్యార్థులకు బోధించడం కూడా సత్ఫలితాలు ఇచ్చింది. ఆంగ్లం అంటేనే గ్లోబల్ లాంగ్వేజ్. దీనిపై మొదటి నుంచి విద్యార్థుల్లో కొంత భయం అలుముకుని ఉంటుంది. దాన్ని పోగొట్టి వారితో ముఖాముఖి మాట్లాడించి డిబేట్లు నిర్వహించాం. మరోవైపు ఇటీవల కాలంలో నిర్వహించిన డాట్ పరీక్షలు మంచి ఫలితాన్ని ఇచ్చాయి. పాఠశాలలో నూటికి నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తారు.

- సనపల లావణ్య,
ఆంగ్ల ఉపాధ్యాయులు,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జగతి

ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు



ఉపాధ్యాయులు మొదటి నుంచి అంత మంది విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పాఠాలు బోధించారు. ఎప్పటికప్పుడు మా తల్లిదండ్రులతో మాట్లాడుతూ మా సమాచారాన్ని తెలియ జేస్తున్నారు. రాత్రివేళలో కూడా మేము ఏ విధంగా చదువుతున్నామనేది వచ్చి పరిశీలిస్తున్నారు. కచ్చితంగా 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధిస్తాను.

- ఎన్.మమత, విద్యార్థి, కొత్తపుట్టుగ

ఇష్టపడి చదువుతున్నాం



చాలా మంది చెప్పినట్టు కష్టపడి కాకుండా మేమంతా ఇష్టపడి చదువుతున్నా. ఎందుకంటే మా ఉపాధ్యాయులంతా 8 గంటలకే పాఠశాలకు చేరుకుని పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎప్పటికప్పుడు తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి మా చదువు వివరాలు వారికి తెలియజేస్తూ వారిని అప్రమత్తం చేశారు. పాఠశాలలో శత శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పడిన కష్టాన్ని చూసిన మేము కూడా మా కోసం, మా భవిష్యత్ కోసం ఇష్టపడి చదివి విజయం సాధిస్తాం. పదో తరగతి పరీక్షల్లో మా పాఠశాల శత శాతం ఉత్తీర్ణత సాధిస్తుంది.

- నర్తు చరణ్, విద్యార్థి, శవసానపుట్టుగ



మాట్లాడుతున్న మోహనరావు

సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధులివ్వాలి

రైతుసంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని అందుకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో పూర్తిస్థాయిలో కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.ప్రసాదరావు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని రైతు సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వంశధార ప్రాజెక్టు ప్రారంభించి అర్థ శతాబ్దం దాటిందని, కాలువల్లో పూడిక తీయకుండా, శిథిలావస్థకు చేరిన వాటిని మరమ్మతులు చేయక పోవడం వల్ల రైతులకు సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార కాల్వల ఆధునికీకరణకు అవసరమైన రూ.1500 కోట్లు వార్షిక బడ్జెట్‌లో కేటాయించాలన్నారు. అలాగే ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులు ప్రారంభించి పదిహేడేళ్లయినా నేటికీ 40 శాతం పూర్తి కాలేదన్నారు. 2007లో రూ.127 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం రూ.852 కోట్లకు అంచనాలు పెరగాయని, సకాలంలో పనులు పూర్తి కాకపోవడం వల్ల రైతుల ఆశ నెరవేరలేదన్నారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నిర్వాసితులకు పరిహారం అందించి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. పైడిగాం ప్రాజెక్టుకు గతంలో అంచనా వేసిన రూ.17 కోట్లు నిధులు మంజూరు చేసి ప్రాజెక్టు ఆధునీకరించడం ద్వారా అదనంగా 7 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. మందస మండలంలోని కళింగ దళ్, డ బార్సింగ్, దామోదర్ సాగరం ప్రాజెక్టులను ఆధునికీకరణకు అవసరమైన నిధులు బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు.

చీపి గడ్డ ద్వారా వృధాగా పోతున్న నీటిని గోపాల్ సాగరంకు మళ్లించడం ద్వారా అదనంగా వెయ్యి ఎకరాలకు సాగునీరు అందుతుందని, అందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. వంశధార, బాహుద నదుల అనుసంధానం, నేరేడు బ్యారేజ్ నిర్మాణం కోసం 2019లోనే సిఎం నిర్వహించిన సమీక్ష సమావేశంలో రూ.6342 కోట్లతో అంచనాలు తయారు చేశారని దానికి అవసరమైన నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. తద్వారా వంశధార నీరు ఇచ్ఛాపురం వరకు సాగునీటితో పాటు అనేక ప్రాంతాలకు తాగు నీరందించేందుకు వీలుందన్నారు. దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న నారాయణపురం, తోటపల్లి, మడ్డువలస సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన మొత్తం నిధులను ఈ బడ్జెట్‌లో కేటాయించి సాగునీటి వనరుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



తొలగిస్తున్న ప్రొక్లెయినర్

అనధికార షాపుల తొలగింపు

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలిలో సంవత్సరాల తరబడి అనధికారికంగా ఏర్పాటు చేసిన షాపులను మున్సిపల్, పోలీస్, రివెన్యూ, సచివాలయ సిబ్బంది సోమవారం తొలగించారు. దీంతో షాపు యజమానులు, కుటుంబీలు దుకాణాలను తొలిగిస్తే తాము ఆత్మహత్యకు పాల్పడామని అధికారుల ముందు వాపోయారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ప్రత్యామ్నాయంగా జీవనోపాధిని పురపాలక సంఘంలో ఏదో ఒకచోట స్థలాన్ని కేటాయిస్తామని చెప్పి వారించడంతో సమస్య తాత్కాళికంగా సమసిపోయింది. అనంతరం షాపులను పురపాలక సంఘ కార్యాలయానికి తరలించారు. తమ పూర్వీకులకు సంబంధించినవని, తమ తాత కృష్ణమూర్తి పేరిట తగు ఆధారాలతో పత్రాలు ఉన్నాయని అధికారులతో వాదించాడు. ఈ షాపుల వల్ల కాలువల్లో మురుగునీరు ప్రవహించడం లేదని, ప్రత్యామ్నాయ మార్గాలు చూపుతమని కమిషనర్ ఎన్.రామారావు బాధితునికి హామీనిచ్చారు.

డీలర్లు రెన్యువల్ చేసుకోవాలి

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని చౌకడిపోల డీలర్లు షాపుల ఆథరైజేషన్లను సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని పౌర సరఫరాల ఉప తహశీల్దార్ హేమసుందరరావు అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లుతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిపోలకు సరుకులు వచ్చేటప్పుడు ఆయా డీలర్లు గోదాం వద్దకు వచ్చి దగ్గర ఉండి తూకం వేసుకోవాలని, అలాగే ఎండియూలకు ఇచ్చేటప్పుడు పక్కాతూకం వేసి ఇవ్వాలన్నారు. సకాలంలో గోదాం వద్ద డీలర్లు బయోమెట్రిక్ వేయాలని, గ్రామాల్లో సక్రమంగా కార్డుదారులకు సరుకులు అందాలన్నారు. సమావేశంలో రెవెన్యూ సిబ్బంది, డీలర్ల సంఘం నాయకులు అబ్బినాయుడు, ముప్పిడి రమేష్, బాడిత హరికృష్ణ, డీలర్లు రాజు, అప్పుడు తదితరులున్నారు.

పకడ్బందీగా 'పది', ఓపెన్ పరీక్షలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో మార్చి నెలలో నిర్వహించనున్న పదో తరగతి, ఓపెన్ స్కూల్ పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డి, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో కలిసి పరీక్షల నిర్వహణపై పాఠశాల విద్యాశాఖ, సమగ్ర సర్వశిక్షా అభియాన్, ఓపెన్ స్కూళ్ల అధికారులతో సోమవారం సమీక్షించారు. ముందుగా డిఇఒ తిరుమలచైతన్య మాట్లాడుతూ మార్చి 17 నుంచి ఏప్రిల్ 1 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈసారి పది పరీక్షలకు 28,984 మంది విద్యార్థులు హాజరుకానున్నారని అన్నారు. వారి కోసం 149 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. 149 పరీక్షా కేంద్రాలకు సూపరింటెండెంట్లు, ఏడు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు నియమించామని చెప్పారు. అలాగే ఓపెన్ స్కూల్ పరీక్షలు మార్చి 3 నుంచి 15 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ పరీక్షలకు 807 మంది విద్యార్థులు ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో రాయనున్నట్లు వివరించారు. ఈ పరీక్షల పర్యవేక్షణకు 8 మంది సూపరింటెండెంట్లు, రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్లను నియమించినట్టు తెలిపారు. అలాగే ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలు కూడా మార్చి 3 నుంచి 15 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 8 పరీక్షా కేంద్రాల్లో 1553 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు, తాగునీరు, మరుగుదొడ్లను అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు నిర్ణీత సమయానికి చేరుకునేందుకు అవసరమైన రవాణా సౌకర్యాన్ని ఆర్‌టిసి అధికారులు సిద్ధం చేయాలన్నారు. పరీక్షల నిర్వహణ, పేపర్లను భద్రపరచడానికి అవసరమైన స్ట్రాంగ్ రూమ్‌లను సిద్ధం చేయా లన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, ఎసిఇ లియాఖత్ అలీఖాన్, జిల్లా ఒకేషనల్ అధికారి తవిటి నాయుడు, జిల్లా వైద్యఆరోగ్య అధికారి బాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

విద్యారంగం బలోపేతానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు, ఉపాధ్యాయుల సంఖ్యను పెంచేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిపి కిల్లి ఉషారాణి అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సాధారణ సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు కొన్ని పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా మార్చుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే మేజర్ పంచాయతీలో సమస్యగా ఉన్న 163/1 సర్వే నెంబర్ సమస్యను వారంరోజుల్లో పరిష్కారం అవుతుందని, తద్వారా రిజిస్ట్రేషన్లు యధావిధిగా జరుగుతాయని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించే చర్యల్లో భాగంగా జలజీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ తాగునీటి పైపులైన్ వేస్తున్నామని, ఈ పనులను త్వరితగతని పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పశువులకు నాణ్యమైన మందులను సరఫరా చేయకపోవడంతో పాడిరైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ఈ ప్రభుత్వమైనా నాణ్యమైన మందులను పాడిరైతులకు అందజేయాలని తుంగపేట సర్పంచ్ పప్పల వేణుగోపాలం కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మీసాల మన్మధరావు, అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఆక్రమణలు తొలగించాలని వినతి

సోంపేట: మండలంలోని బారువాలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన స్థలం ఆక్రమణలకు గురైందని, అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ మండల కమిటీ అధ్యక్షుడు ఎ.యుగంధర్, కార్యదర్శి ఎస్.జయరామ్ కోరారు. ఈ మేరకు తహశీల్దార్ బి.అప్పలస్వామిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు గ్రామస్తులు సుమారు పది ఎకరాల స్థలాన్ని ఇచ్చారన్నారు. భవనాలు మాత్రమే నిర్మించారని, ప్రహరీ లేకపోవడంతో పరిసర ప్రాంత వాసులు స్థలాన్ని ఆక్రమించారని తెలిపారు. ప్రభుత్వం ప్రహరీ నిర్మాణానికి రూ.79 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. ప్రహరీ నిర్మిస్తే ఆక్రమలకు అవకాశం ఉండదన్నారు.

చెక్‌పవర్ రద్దుపై న్యాయ పోరాటం

మండపల్లి సర్పంచ్ శేషమ్మ



శేషమ్మ, మండపల్లి సర్పంచ్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పంచాయతీలో గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి పనులు చేపట్టితే... కేవలం కక్షసాధింపు చర్యలకు పాల్పడి అకారణంగా చెక్ పవర్ రద్దు చేశారని మండపల్లి సర్పంచ్ పిట్ట శేషమ్మ అన్నారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. చెక్ పవర్ రద్దుపై పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. నాలుగేళ్ల పాలనలో నలుగురు పంచాయతీ కార్యదర్శులు మారారని అన్నారు. ఇప్పటి వరకు తనకు పంచాయతీ తీర్మానాల పుస్తకం అందజేయలేదన్నారు. తనకు రికార్డులు అప్పగిస్తే అన్ని ఆధారాలతో సహాయ నిరూపిస్తానని చెప్పినా గడువు ఇవ్వలేదన్నారు. నిధులు దుర్వినియోగం అంటూ ఆరోపణలలో వాస్తవాలు లేవన్నారు. సొంత డబ్బులతో సకాలంలో బిల్లులు రాకపోయినా అభివృద్ధి పనులు చేశానన్నారు. ఏనాడూ ఒక్క రూపాయి ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం చేయలేదన్నారు. వ్యక్తిగత కక్షి సాధింపు చర్యలకు పాల్పడి కొంతమంది రాజకీయ నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి తనపై చర్యలకు పాల్పడ్డారని తెలిసిందన్నారు. పంచాయతీ పరిధిలోని మండపల్లి, బుడ్డుపుపేట, ఎం.తొటూరు, భవానీపురం గ్రామాలకు రూ.లక్షలు వెచ్చించి అనేక అభివృద్ధి చేపట్టామని తెలిపారు. పంచాయతీ కాంట్రాక్టర్లకు రూ.30 లక్షల వరకు చెల్లించాల్సి ఉందని తెలిపారు.

కక్షసాధింపులో అచ్చెన్నది ప్రథమ స్థానం



మాట్లాడుతున్న తిలక్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పాలనాపరంగా 17వ ర్యాంకులో ఉంటే... కక్షసాధింపు చర్యల్లో ప్రథమ స్థానంలో ఉన్నారని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆరోపించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం విలేకరలతో మాట్లాడారు. జిల్లాలో రైతులు పండించిన ధాన్యానికి కనీసం గిట్టుబాటు ధర లేక అవస్థలు పడుతుంటే... కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు విమానాలు, హెలికాప్టర్లు అంటున్నారని విమర్శించారు. నియోజవర్గంలో దళితులపై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని ఎస్‌పికి పలుమార్లు వినతిపత్రాలు అందజేశామన్నారు. అయినా నియోజవర్గంపై దృష్టి పెట్టడం లేదన్నారు. మండల పరిషత్‌లో ఉన్న నిధులు అభివృద్ధి పనులు చేయకుండా మంత్రి అడ్డుకుంటున్నారని అన్నారు. ఇప్పటికైన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ టెక్కలి నియోజకవర్గంలో జరుగుతున్న అచాచకాలపై చొరవ చూపాలని కోరారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు బుడ్డా మోహన్‌రెడ్డి, సంపతరావు రామసుందరరాజు, ఎంపిపి ప్రతినిధి రోణంకి మల్లయ్య, సత్తారు సత్యం, పేడాడ వెంకటరావు పాల్గొన్నారు.

క్లస్టర్ కాంప్లెక్స్ అర్థవంతంగా సాగాలి



మురళీప్రకాష్

ప్రజాశక్తి- కవిటి


స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌ల స్థానంలో ఏర్పాటు చేసిన క్లస్టర్ కాంప్లెక్స్ అర్థవంతంగా సాగాలని, లేదంటే ఫలితం శూన్యమని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.మురళీప్రకాష్ అన్నారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఒక్కో క్లస్టర్ లో పాఠ్య విభాగానికి నలుగురైదుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉండడంతో క్లస్టర్ కాంప్లెక్స్ అర్థవంతంగా జరగలేదని, కేవలం ఎస్‌సిఇఆర్‌టి వీడియోలు చూడడానికే కాంప్లెక్స్ పరిమితమైందని అన్నారు. గతంలో నిర్వహించిన సమావేశాల్లో ఒక పాఠ్యాంశానికి సంబంధించి 20 నుంచి 30 మంది ఉపాధ్యాయులు ఉండేవారిని, అందులో వారికి ఎటువంటి సమస్యలు ఉన్నా చర్చించుకుని కొత్త కొత్త బోధనా విధానాలు నేర్చుకునే వారిని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని అన్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులనూ ఒకటి, రెండు తరగతులను బోధించే ఉపాధ్యాయులను ఒక గ్రూపుగా, మూడు, నాలుగు, ఐదు తరగతులు బోధించే ఉపాధ్యాయులను మరో గ్రూపుగా విడదీయడంతో వారి సంఖ్య తగ్గిపోయిందని అన్నారు. ఈ విషయాలపై విద్యాశాఖ పునరాలోచించి క్లస్టర్ కాంప్లెక్స్ విజ్ఞానాన్ని, ఆధునిక బోధనా పద్ధతులు పెంపొందించేదిగా ఉండాలని సూచించారు. క్లస్టర్ కాంప్లెక్స్ ఒక్క పూట మాత్రమే జరగడంతో ఉపాధ్యాయుల అనుభవాలు, సమస్యలు తెలుసుకునే అవకాశం లేదన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే ఉపాధ్యాయులు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. దీనిపై విద్యాశాఖ దృష్టిసారించి క్లస్టర్ కాంప్లెక్స్ అర్థవంతంగా, అందరికీ ఉపయోగపడేలా రూపొందించాలని కోరారు.



అవగాహన కల్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

బ్యాలెట్ పేపర్‌పై అవగాహన

టెక్కలి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బ్యాలెట్ పేపర్‌పై ఉపాధ్యాయులకు యుటిఎఫ్ నాయకులు అవగాహన కల్పించారు. మండలంలోని పది ఉన్నత పాఠశాలల్లో, పలు ప్రయివేటు పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులను కలిసి పిడిఎఫ్ బలపరిచిన అభ్యర్థిని కోరట్ల విజయగౌరి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టెక్కలి మండలం నాయకులు తమ్మినేని వైకుంఠరావు, కురమానద, పాలవలస ధర్మారావు, బమ్మిడి ఖగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

విద్యార్థినికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని హర్షబాడ పంచాయతీ పరిధిలో ఉన్న పెద్దగురువురుకు చెందిన మొగిలిపాటి స్వప్న నిరుపేద కుటుంబానికి చెందిన విద్య కుసుమం. ఎన్నో ఆర్థిక ఇబ్బందులకు లోనైనా ఇంజినీరింగ్ పూర్తి చేయాలని దఢ సంకల్పంతో విద్యను కొనసాగిస్తుంది. మండవ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జగ్గయ్యపేటలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతుంది. మొదటి రెండేళ్ల పరీక్షలు పూర్తి చేసి మూడో ఏడాదికి పరీక్ష, హాస్టల్ ఫీజు చెల్లించే పరిస్థితి లేదు. దీంతో ఇంటి వద్దే 15 రోజులుగా ఉంది. విషయం తెలుసుకున్న ఆదివాసీ గిరిజన చైతన్య వేదిక సంఘానికి గ్రామస్తులు తెలియజేశారు. ఆ సంఘం నుంచి రూ.పది వేలు దాతలు సోమవారం ఆర్థికసాయం చేసి కళాశాలకు పంపించారు. కార్యక్రమంలో ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరహాల కృష్ణారావు, ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యర్ర రాజు, ఆదివాసీ గిరిజన చైతన్య వేదిక మండల అధ్యక్షులు మొగిలిపాటి జగ్గారావు, మొగిలిపాటి గిరిధర్, మరాఠి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

'గోరుముద్ద'కు ప్రాధాన్యత ఇవ్వాలి



రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే

పాతపట్నం: టిడిపి కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న గోరుముద్ద పథకాన్ని ప్రాధాన్యత ఇవ్వడంలో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. ఈ సందర్భంగా సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు వల్ల కీలక పథకాలు అస్తవ్యస్తమయ్యాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌పై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని అన్నారు. డొక్కా సీతమ్మా పేరు పెట్టిన ప్రభుత్వం, నాణ్యతను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని చెప్పారు. మాజీ సిఎం జగన్ పాలనలో 16 రకాల పదార్థాలతో రోజుకో మెనూతో బడి పిల్లలకు గోరుముద్ద పథకం కింద పౌష్టికాహారం అందించిందని గుర్తు చేశారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ

సరుబుజ్జిలి: మండలంలోని రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేశారు. సోమవారం దూసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కంటి వైద్యాధికారి బి.వి.ఎం. ప్రసాదరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల్లో నేత్ర చికిత్స అవసరాన్ని గుర్తించిన 20 మంది విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. రామకృష్ణారావు ఆధ్వర్యంలో ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు.

సద్దుమణిగిన రోడ్డు సమస్య

మెళియాపుట్టి : మండలంలోని గోకర్ణపురం-సంతలక్ష్మీపురం గ్రామాల మధ్య రహదారి స్థల సమస్య కొద్ది రోజులుగా వెంటాడుతుంది. సోమవారం ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, తహశీల్దార్ బడే పాపారావు, సర్వేయర్ శ్యామలరావు, రెవెన్యూ సచివాలయ సిబ్బంది వెళ్లి గ్రామానికి వెళ్లి మాట్లాడారు. అందరినీ ఒప్పించి సమస్యను పరిష్కరించారు. దీంతో రోడ్డు సమస్య సద్దుమణిగింది.



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు


అభినందనలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

కేంద్రమంత్రికి అభినందనలు

పోలాకి: డిపిఎన్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అభినందనలు తెలిపారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని కేంద్రమంత్రి కార్యాలయంలో ఆయనను నియోజకవర్గ ప్రజల తరుపున సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెనుకబడిన తీర ప్రాంతం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలాగా సహాయ, సహకారాలు అందజేస్తుందన్నారు. అందులో భాగంగా డిపిఎన్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరుకు కేంద్రమంత్రి కృషి చేశారని అన్నారు. అలాగే వంశధార కాలువ ఆధునికీకరణ, కరకట్టల పనులు పూర్తి చేసేందుకు, మోడరైజేషన్ పనులకు నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మెరిట్ స్కాలర్‌షిప్‌కు హరిణి ఎంపిక

కొత్తూరు: మండలంలోని పాతపొన్నుటూరు ఎంపియుపి పాఠశాలలో 8వ తరగతి బాలిక పతివాడ హరిణి ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు గుర్రాల కృష్ణారావు సోమవారం తెలిపారు. గతేడాది డిసెంబరు 8న టెక్కలిలో నిర్వహించి నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్ష రాసిందన్నాందన్నారు. జిల్లా స్థాయి 21వర్యాంకు సాధించుకుని స్కాలర్ షిప్‌కు అర్హత పొందిందన్నారు. ఈ సందర్భంగా హరిణిని అభినందిస్తూ శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అంధవరపు రాజేష్, బూడిద సంతోష్‌కుమార్, పైసక్కి చంద్రశేఖరం, యిస్తై సౌజన్యవతి, బొమ్మాళి నాగేశ్వరరావు, కుదమ తిరుమలరావులు పాల్గొన్నారు.

శ్రేయమిశ్రాకు మరో అవార్డు

పాతపట్నం: పాతపట్నం జర్నలిస్టు కాలనీకి చెందిన శ్రేయమిశ్రా ప్రదర్శించిన కూచిపూడి నృత్యానికి మరో అవార్డు సొంతం చేసుకుంది. వాడపల్లి వెంకటేశ్వర ఆలయం ప్రాంగణంలో ఆదివారం రాత్రి శాస్త్రీయ నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఇందులో శ్రేయమిశ్రా కూచిపూడి నృత్యానికి తిరుమలై అవార్డును ప్రదానం చేశారు. ప్రముఖ సినీ నటులు ప్రసన్నకుమార్ చేతుల మీద ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రేయమిశ్రను అభినందిస్తూ మున్ముందు మరెన్నో అవార్డులు సాధించు కోవాలన్నారు. ఆలయ నిర్వాహకులు, నాట్యాచార్యులు అర్చన ఉషశ్రీ పాల్గొన్నారు.


సన్మానిస్తున్న సంఘ నాయకులు

చక్రధర్ దంపతులకు సన్మానం

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో స్థానిక 18వ వార్డులో మార్కండేయ వీధిలో భద్రావతి సమేత భావన రుషి కళ్యాణ మహోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ మహోత్సవంలో ఆపల్గొన్న మున్సిపల్ మాజీ కో-ఆప్షన్ నంబరు, టిడిపి నాయకులు, 18వ ఇన్‌ఛార్జి పైల చక్రధర్, దేవకి దంపతులకు మార్కండేయ పద్మశాలి సంఘం నాయకులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు మాదాబత్తుల శివ, ఉపాధ్యక్షులు మంచంశెట్టి ప్రభాకరరావు, సెక్రటరీ శంకరరావు, జాయింట్ సెక్రెటరీ తిరువీధుల నాగేశ్వరరావు, ట్రెజరర్ వర సత్యనారాయణ పాల్గొన్నారు.

స్టడీ అవర్ పరిశీలన

కోటబొమ్మాళి: మార్చిలో నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులంతా బాగా చదువుకొని మంచి మార్కులు సాధించాలని ఎంఇఓ ఎల్.వి.ప్రతాప్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు నిర్వహించిన స్టడీ అవర్‌ను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డబ్బీరు గోవిందరావు, ఉపాధ్యాయులు సామ సంజీవరావు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ పూర్వ జిల్లా కార్యదర్శి మృతి

ఆమదాలవలస: పట్టణంలోని కొత్తకోట వారి వీధిలో నివాసం ఉంటున్న ఎపిటిఎఫ్ పూర్వ జిల్లా కార్యదర్శి, విశ్రాంత ఉపాధ్యాయుడు తమ్మినేని రామానుజాచార్యులు (84) సోమవారం మృతి చెందారు. ఈయన విశ్వసాహితి సేవా సంస్థ గౌరవాధ్యక్షులుగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. ఆయన మృతిపై ఎపిటిఎఫ్ రాష్ట్ర నాయకుడు భానుమూర్తి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బొడ్డేపల్లి మోహనరావు, బొడ్డేపల్లి జనార్ధనరావు తదితరులు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపి నివాళ్లర్పించారు. ఈయనకు భార్య విజయలక్ష్మి, కుమారుడు ప్రసాద్, కుమార్తెలు అమరవాణి, అరుణ ఉన్నారు.

రైల్వేస్టేషన్‌లో కుక్కల మకాం

భయపడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌లో కుక్కలు నిత్యం సంచరిస్తుండడంతో రైల్వే ప్రయాణికులు హడలెత్తిపోతున్నారు. రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణికులు బయటకు వచ్చే నడక వంతెన మార్గంలో కుక్కలు గుంపులుగా మకాం వేయడంతో రైలు దిగి రాకపోకలు సాగించే ప్రయాణికులు భయందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్కసారి రైలు వచ్చి ప్లాట్ ఫామ్‌పై నిలిచే సమయంలో ప్రయాణికులు రైలు ఎక్కడానికి పరుగులు తీస్తున్న సమయంలో నడక వంతెనపై అడ్డంగా పడుకొని ఉండడంతో పలుమార్లు కింద పడి


నడక దారి వంతెనపై ఉన్న కుక్కలు

ప్రయాణికులు గాయాల పాలైన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని పలువురు వాపోతున్నారు. పలుమార్లు రైల్వే పారిశుధ్య సిబ్బందికి, అధికారులకు సమస్యను తెలియజేసినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైల్వేస్టేషన్ ప్రాంతంలో పారిశుధ్య పనులతో పాటు కుక్కల బెడద, ఇతర సమస్యలను పరిష్కరించాల్సిన పారిశుధ్య గుత్తేదారు దృష్టి సారించకపోవడంపై రైల్వే ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌కు పారిశుధ్య విభాగంలో ఉత్తమ అవార్డు లభించిందని ఆ తరువాత కాలంలో రైల్వే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సమస్య మళ్లీ మొదటికే వచ్చిందని పలువురు చర్చించుకుంటున్నారు. ఇటువంటి సమస్యలు పలుమార్లు ఎదురువు తున్నప్పటికీ రైల్వే అధికారులు సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటోనని పలువురు రైల్వే ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు కుక్కల బెడద నుంచి ప్రయాణికులను కాపాడాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు.


నేత్రాలను పరీక్షిస్తున్న వైద్యాధికారి సురేష్

79 మందికి నేత్ర వైద్య పరీక్షలు

పలాస: శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన స్థాయి సాయి ప్రశాంతి మందిరంలో సోమవారం నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 79 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. అందులో 55 మందికి ఆపరేషన్ చేయనున్నారు. కార్యక్రమంలో నేత్ర వైద్యులు సురేష్, క్యాంప్ కో-ఆర్డినేటర్ సాయి, కన్వీనర్ జగదీష్, శ్రీకాకుళం సాధన శిబిరం ఇన్‌ఛార్జి జె.సిహెచ్. శ్రీనివాస్, కౌంత్యుడు, కృష్ణస్వామి, కామేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

పలాస : మండలంలోని కిష్టపురంలో మంగళవారం గ్లో సంస్థ ఆధ్వర్యాన మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో విడుదలైంది. ఈ వైద్య శిబిరంలో ఎముకులు, గుండె, చెవి, ముక్కు, గొంతు, చర్మ వ్యాధులు, బిపి, సుగర్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్

ప్రజాశక్తి- పొందూరు

మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం స్టాల్‌ను ఏర్పాటు చేశారు. మండలంలోని తండ్యాం పంచాయతీలో ప్రకృతి వ్యవసాయం సాగు పద్ధతుల ద్వారా పండించిన వివిధ రకాల కూరగాయలను విక్రయించారు. ఈ సందర్భంగా ఆరోగ్యకరమైన జీవనానికి ప్రకృతి వ్యవసాయ సాగు ఉత్పత్తులను వినియోగించాలంటూ అవగాహన కల్పిస్తూ కూరగాయలను విక్రయించారు. ఈ కార్యక్రమంలో డిఎంఎంటి వై.భాస్కరరావు, యూనిట్ ఇన్‌ఛార్జి మల్లేష్, బి. రవికుమార్, బి.హైమావతి, ఐసిఆర్‌పిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయ సాగు ఉత్పత్తులను విక్రయిస్తున్న సిబ్బంది

ఖాళీ స్థలాలను గుర్తించాలి

కమిషనర్ రామారావు

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ ఆదేశాల మేరకు పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలోని ఖాళీ స్థలాలను గుర్తించి, ఆయా స్థలాల్లో జంగిల్ క్లియరెన్స్ చేసి, పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు సిబ్బందికి ఆదేశించారు. మున్సిపల్ సమావేశం మందిరంలో పురపాలక సంఘంలోని అడ్మిన్, శానిటేషన్, ఎమినిటీస్, ప్లానింగ్ సెక్రటరీలతో కలిసి సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎపి పురపాలక సంఘ చట్టం, 1965 ప్రకారం పురపాలక సంఘంలోని అన్ని సచివాలయంల పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించాలన్నారు. గుర్తించిన మూడు రోజుల్లో జంగిల్ క్లియరెన్స్ చేసి స్థలాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఖాళీ స్థలాలపై సంబంధిత


మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

యజమానుల నుంచి పన్నులు వసూతు చేయాలన్నారు. పన్నులు చెల్లించని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఖాళీ స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తయిన వెంటనే ఆయా స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో పురపాలక సంఘం రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

వికలాంగులకు సంక్షేమ పథకాలు అందించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

వికలాంగులందరికి సంక్షేమ పథకాలు అందించేందుకు బాధ్యతగా వ్యవహరించాలని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్యానెల్ అడ్వకేట్, సీనియర్ న్యాయవాది తమ్మినేని అన్నం నాయుడు అన్నారు. సోమవారం పట్టణంలోని పదోవార్డు పరిధిలో మెట్టక్కివలస, పాత కంద్రపేటలో వికలాంగుల నిర్ధారణ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 80 ఇళ్లలో సర్వే నిర్వహించారు. అందులో ఇద్దరు


పరిశీలిస్తున్న అన్నం నాయుడు, వైద్యసిబ్బంది

వికలాంగులను గుర్తించినట్లు తెలిపారు. ఒకే ఇంటిలో ఉన్న నాగళ్ల వైష్ణవి, నాగళ్ల జగతిలను వికలాంగులుగా గుర్తించామని వీరికి పూర్తి స్థాయిలో అంగవైకల్యం ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి పథకాలు అందడం లేదని గుర్తించినట్లు తెలిపారు. వీరికి అన్ని విధాల సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. ఈ సర్వేలో వైద్య సిబ్బంది హెచ్‌వి భూలక్ష్మి, ఎఎన్ఎంలు డి.ధనలక్ష్మి, ఐ.అనుపమ, అంగన్వాడీ సిబ్బంది లక్ష్మి, కర్మ కర్, రూప, ఆశా వర్కర్లు ఉన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సచివాలయ సేవలు అందించాలని ఎంపిడిఒ ఆర్.వెంకటరావు అన్నారు. సోమవారం మండలంలోని వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్‌ల కార్యవర్గ ఎన్నికను నిర్వహించుకుని సంబంధిత కాపీని ఎంపిడిఒకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సచివాలయ సిబ్బందికి పలు సలహాలు అందించారు. యూనియన్ అధ్యక్షులుగా కొర్లకోట సచివాలయానికి చెందిన చింతాడ శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీగా సువ్వారి వెంకటలక్ష్మి, మానుకొండ కాశేశ్వరరావు, కోశాధికారిగా మండ మనోహర్, ఆర్గనైజేషన్ కార్యదర్శిగా శ్రీకాంత్,


ఎంపిడిఒకు కార్యవర్గం జాబితాను అందజేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు

ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా పేడాడ సంతోష్ కుమార్, బలగ వాసుదేవరావు, దీపాల విజయ్ కుమార్, బొడ్డేపల్లి శారద, ఎస్.రమ్య, దవళ శైలజ, టెక్నికల్ ఆర్గనైజర్లుగా ఎం.ప్రభాకరరావు, పిట్టా ఈశ్వరరావులను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం


పాతపట్నం : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లావణ్య

ప్రజాశక్తి- పాతపట్నం

విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ బి.లావణ్య అన్నారు. మండలంలోని రొంపివలస పాఠశాలలో సోమవారం సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ప్రస్తుత కాలంలో చిన్నపిల్లలు, మహిళలపై జరిగే అఘాయిత్యాలు, దొంగతనాలు, సైబర్ నేరాలపై జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వాటికి సంబంధించిన చట్టాలు తెలుసుకోవాలన్నారు. ఆన్‌లైన్ మోసాలు జరగకుండా మీమీ గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలన్నారు. అపరిచితుల వ్యక్తులు, అపరిచిత వ్యక్తుల నుంచి సైబర్ కాల్స్ వచ్చిన వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు, టోల్ ఫ్రీ నంబరు 100కు డయల్ చేసి తెలియజేయాలన్నారు. మైనర్లు వాహనాల నడపడం నేరమన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఇచ్ఛాపురం : మాదకద్రవ్యాలకు యువత విద్యార్థులు దూరంగా ఉండాలని పట్టణ ఎస్ఐ ముకుందరావు అన్నారు. స్థానిక స్వర్ణ భారతి జూనియర్ కళాశాలలో 'సంకల్పం' కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని అన్నారు. స్వర్ణ భారతి విద్యా సంస్థల చైర్మన్ చాట్ల తులసి దాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజంపై బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి చాట్ల రాము, ప్రిన్సిపాల్ జల్లు జయప్రకాష్ పాల్గొన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ రవివర్మ


ఇచ్ఛాపురం : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ముకుందరావు

మాదకద్రవ్యాల విక్రయంపై నిఘా

కవిటి: మాదకద్రవ్యాల విక్రయంపై ప్రత్యేక నిఘా వేశామని, మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రవివర్మ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని అన్ని షాపులను డాగ్ స్క్వాడ్ ద్వారా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కాలంలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, దీనిపై ఎటువంటి సమాచారం ఉన్నా తమను సంప్రదించాలని సూచించారు. ఈ తనిఖీల్లో డాగ్ స్క్వాడ్, కవిటి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


అంతిమయాత్రలో పాల్గొన్న విజయ

కృష్ణారెడ్డి అంతిమయాత్ర

ఇచ్ఛాపురం: మండలంలోని ధర్మపురం వద్ద ఆదివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో వైసిపి మండల నాయకులు రంగాల కృష్ణారెడ్డి అంతిమయాత్ర సోమవారం నిర్వహించారు. ఈ యాత్రలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ పాల్గొన్నారు. ముందుగా మృతుడి కుటుంబానికి ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వైసిపి అండగా ఉంటుందని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు రాంపత్ని చిట్టిబాబు, కారంగి మోహనరావు, ఎంపిటిసి సాడి కాంచనాదేవి, టి.బరంపురం, సర్పంచ్ కారంగి త్రినాథ్, కౌన్సిలర్ బచ్చు జగన్ పాల్గొన్నారు.


వాక్‌థాన్ నిర్వహిస్తున్న గ్యాస్ డీలర్లు

ఇంధన సంరక్షణ అందరి బాధ్యత

శ్రీకాకుళం అర్బన్: ఇంధన సంరక్షణ అందరి బాధ్యతని ప్రతిఒక్కరూ ఇంధన పొదుపును పాటించి భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందని భారత్ గ్యాస్ టెరిటరీ మేనేజర్ వేణుగోపాల్, సేల్స్ ఆఫీసర్ సందీప్ మిశ్రా అన్నారు. ఇంధన సంరక్షణ ఆవశ్యకతను చాటిచెప్పేందుకు భారత్ గ్యాస్ సంస్థ ఆధ్వర్యాన సాక్షం 2025 పేరిట నగరంలోని జిల్లా కేంద్రంలో భారీ వాకథాన్ నిర్వహించారు. భారత్‌గ్యాస్, హెచ్‌పి గ్యాస్, ఇండియన్ గ్యాస్ సంస్థల సిబ్బంది, డెలివరీ బాయ్స్, షోరూం సిబ్బంది, డిస్ట్రిబ్యూటర్లు, పాల్గొన్నారు.


కంప్యూటర్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కంప్యూటర్ అందజేత

పాతపట్నం : మండలంలోని కొరసవాడ జిల్లా పరిషత్ పాఠశాలలో 1994-95 బ్యాచ్ పూర్వ విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉద్యోగరీత్యా స్థిరపడారు. వారందరూ ఒక్కటై సోమవారం పాఠశాలకు కంప్యూటర్‌ను అందజేశారు. అనంతరం నాటి ఉపాధ్యాయులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సింహాచలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

ఎమ్మెల్సీ పరామర్శ

ఇచ్ఛాపురం : పట్టణం, మండలంలో ఇటువల మృతి చెందిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్సీ నర్తు రామారావు సోమవారం పరామర్శించారు. మండలంలోని అరకభద్ర రంగాల కృష్ణారావు, ఒకటో వార్డు కొనతల సారధి కుమార్తె కొనతల ఉషారాణి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రతినిధి పిలక సంతు, ఎంపిపి బోర పుష్ప, సుగ్గు ప్రేమ్‌కుమార్, చాట్ల తిరుపతి పాల్గొన్నారు.

శుభ్రతపై ప్రచారం

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్థానిక కె.కొత్తూరు గ్రామస్తులకు పరిశుభ్రత-పారిశుధ్యంపై సోమవారం అవగాహన కల్పించారని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా తడి, పొడి చెత్త వేరు చేయుడం వల్ల కలిగే ప్రయోజనాలపై ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ ఎస్.వి. మారుతీప్రసాద్, అధ్యాపకులు కె.పి.ఎస్. సూర్యనారాయణ, శాక్ ఇన్‌చార్జి జె.సురేష్ కుమార్, చిరంజీవి పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు